మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ భక్త బృందం సభ్యులు

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 15 : వనపర్తి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్ ఇండియన్ యూత్ అభయాంజనేయస్వామి, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో గణపతులను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆదివారం దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరినీ సుఖసంతోషాలతో ఉండేలా దీవించాలని ఆకాంక్షించారు. నిమజ్జన ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం వెంకటేశ్వర స్వామి భక్త బృందం యూత్ సభ్యులు సింగిరెడ్డిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఉంగ్లం అలేఖ్య, గంధం పరంజ్యోతి, సూర్యవంశం గిరి, యుగంధర్‌రెడ్డి, చిట్యాల రాము, బంగారి రఘు, గోర్ల ప్రేమ్, తోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహిళా కార్యదర్శి షాహెదాసుల్తానాను సన్మానిస్తున్న సంఘం నాయకులు

ఈ-కుబేర్ వ్యవస్థను రద్దు చేయాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 15 : ఉపాధ్యాయుల ఆర్థిక సమస్యల పరిష్కారానికి గుదిబండగా మారిన ఈ-కుబేర్ వ్యవస్థను రద్దు పర్చి ట్రెజరీ ద్వారానే అన్ని రకాల పెండింగ్ బిల్లులు చెల్లింపులు జరపాలని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం బీఎన్‌రెడ్డికాలనీలోని సంఘం కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల భవిష్యనిధి, సరెండర్ లీవు, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాలను ఇంతవరకు విడుదల కాలేదన్నారు. మిగిలిన పండిట్, పీఈటీలను అప్‌గ్రేడేషన్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ నివేదికను సమర్పించారు. సంఘం రాష్ట్ర మహిళా కార్యదర్శి షాహెదా సుల్తానాను సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ, కోశాధికారి నర్సింహులు, నాయకులు శ్రీనివాస్‌గౌడ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆగిన చిట్టి గుండె

- ఆర్థిక స్థోమత లేక అందని మెరుగైన వైద్యం

అచ్చంపేట టౌన్, సెప్టెంబర్ 14 : పట్టణంలోని 3వ వార్డు రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన రాఘవేందర్, ఉమామహేశ్వరి దంపతుల కూతురు ప్రగతి(12) గుండెకు సంబంధిత సమస్యతో బాధపడుతూ కొన్నేండ్లుగా వైద్యం పొందుతున్నది. ఇటీవల జూన్‌లో దాతల సహకారంతో ఆపరేషన్ చేయించారు. అయినా ఆరోగ్యం కుదుటపడలేదు. ఆర్థిక సమస్యలతో తల్లిదండ్రులు సైతం వైద్యం అందించలేకపోయారు. కాగా, ఆదివారం మరోసారి గుండె నొప్పి రావడంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు.

ఆ ఠాణాలో అన్నీ పంచాయితీలే!

- ఏ తప్పుచేసినా డోంట్ వర్రీ..
- నేరం ఎంత చేస్తే జేబుకు అంత చిల్లు
- సెటిల్‌మెంట్ అడ్డాగా మారిన స్టేషన్

గద్వాల అర్బన్, సెప్టెంబర్ 15 : అది పేరుకే పోలీస్‌స్టేషన్.. కానీ అక్కడ జరిగేవి అన్నీ సెటిల్‌మెంట్ కేసులే.. పంచాయితీలకు అడ్డాగా ఆ పోలీస్‌స్టేషన్ మారిందటు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ పోలీస్‌స్టేషన్‌లో ఎంత పెద్ద నేరం చేసినా చేతుల్లో డబ్బులు ఉంటే అంత సులువుగా బయటపడొచ్చనే ఆరోపణలు ఉన్నాయి. అక్కడ కేసు అయ్యిందంటే నెత్తి మీద తడిగుడ్డ వేసుకోవాల్సిందేనని విమర్శలు ఉన్నాయి. అక్కడ న్యాయం కంటే అన్యాయం చేసిన వారికే విలువ ఎక్కువని స్థానికులు బాహాటంగా చర్చించుకుంటున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లాలోని కేటీదొడ్డి మండల పోలీస్‌స్టేషన్‌లో సెటిల్‌మెంట్ పంచాయితీలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ పోలీస్‌స్టేషన్‌కు న్యాయం కోసం వెళ్లే ప్రజల పట్ల అధికారులు, సిబ్బంది వ్యవహరించే తీరు దారుణంగా ఉంటుందనే విమర్శలు లేకపోలేదు. అక్కడ కేసుల విచారణ కంటే పంచాయితీలకే పోలీసులు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఏదైనా విషయంలో ఎవరైనా ఫిర్యాదు కోసం వస్తే బాధితుడు ఎవరి మీదైతే ఫిర్యాదు చేస్తున్నారో వారిని పిలిపించి రెండు వర్గాల మధ్య పంచాయితీ పెట్టి డబ్బులు వసూలు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఈ ఠాణాలోని ఓ అధికారి సెటిల్‌మెంట్లు పోలీస్ స్టేషన్‌లో చేరి వసూళ్ల కోసం బజారుకు వెళ్లి సెటిల్‌మెంట్ చేసిన వ్యక్తులకు ఫోన్ చేసి తాను ఉన్న స్థలానికి రప్పించుకొని డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆ ప్రాంతంలో పెద్ద మొత్తంలో చర్చలు వినబడుతున్నాయి. ఏందీ సార్.. మీరు న్యాయం చేస్తారు.. అనుకుంటే.. డబ్బులు వసూలు చేస్తున్నారు.. ఇది న్యాయమా.. అని బాధితులు అడిగితే సదరు అధికారి మీ కోసం ఇంతలా చేసిన కూడా మీరు ఈ చిన్న మొత్తంలో ఇచ్చుకోవడానికి ఇంతలా బాధపడుతున్నారే.. అని అంటున్నారని బాధితులు పెదవి విరుస్తున్నారు. అలాగే ఇసుక, మట్టి, బియ్యం అక్రమంగా సరఫరా చేసే వారికి పోలీస్ సిబ్బందికి మంచి సంబధాలు ఉన్నాయని బహిరంగంగానే ఆరోపణలు ఉన్నాయి. నెలకు కొంత మొత్తంలో డబ్బులు పోలీస్ సిబ్బందికి అప్పచెప్పితే చాలు.. అక్రమ వ్యాపారులకు అడ్డంకులే లేవు. పొరపాటున పోలీస్ సిబ్బందికి తెలియకుండా అక్రమంగా సరఫరా అయిందంటే చాలు అగ్గిమీద గుగ్గిలంలా చెలరేగి వారి వాహనాన్ని వెంబడించి ఎంతదూరం పోయిన పట్టుకొని కేసు నమోదు చేసి మళ్లీ డబ్బులు వసూలు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఈ మధ్య ఓ వాహనం అక్రమంగా బియ్యం లోడ్‌తో కర్ణాటక రాష్ట్రంలోని రాయిచూర్‌ను దాటి పోతున్న క్రమంలో కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్ సిబ్బంది వెంబడించి పట్టుకొని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. వాస్తవానికి పోలీసులు చేసిన పని తీరు పర్వాలేదు. అయితే అసలు విషయం అప్పుడు బయడపడింది. ఆ అక్రమ వ్యాపారి పోలీస్ సిబ్బందికి నెల మామూళ్లు ఇవ్వడం లేదనే కోపంతో వాహనాన్ని పట్టుకొన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తీరా వాహనం వెండిచే క్రమంలో తనకు గాయాలు అయ్యాయని తనకు హాస్పిటల్ చూయించుకునేందుకు ఖర్చులకు డబ్బులు కావాలని డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఇదిలా ఉంటే స్టేషన్‌లో విధులు నిర్వహించే ఓ అధికారి గద్వాల నుంచి రాయిచూర్‌కు వెళ్లే డీసీఎం, బొలేరో, లారీ, ఆటోలను స్టేషన్ ఎస్‌హెచ్‌వో లేకున్నా వాహనాన్ని నిలిపి తనిఖీ చేస్తున్నట్లు సమాచారం. ఏవీ లేకున్నా.. తనకు మాత్రం మామూళ్లు ఇవ్వాల్సిందే అన్నట్లుగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులు ఉన్న పోలీస్‌స్టేషన్‌పై నిఘా పెట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

వట్టి పుకార్లే.. : డీఎస్పీ సత్యనారాయణ

సెటిల్‌మెంట్ చేస్తున్నారన్న విషయం వట్టి పుకార్లే. వాస్తవానికి ఎవరైనా ఫిర్యాదు చేస్తే రెండు వర్గాలను పిలిచి విషయం, సమస్య తెలుసుకొని విచారిస్తాం. వారిని సమన్వయం చేసి నేరాలపై అవగాహన కల్పిస్తాం. ఈ క్రమంలో బాధితుల మధ్య ఉన్న నిజాలను తెలుసుకొని కేసులు నమోదు చేస్తాం. అంతే తప్పా సెటిల్‌మెంట్లు చేసి డబ్బులు వసూలు చేస్తున్నారన్న విషయం పూర్తిగా అవాస్తవం.

రైతాంగ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

అరుణ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న నేతలు

గోపాల్‌పేట, సెప్టెంబర్ 15 : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శ్రీరాం అన్నారు. మండలంలోని ఏదుట్లలో సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను ఆదివారం నిర్వహించారు. అరుణ పతాకాన్ని ఆవిష్కరించి, దొడ్డి కొమరయ్య, చాకలి ఐలమ్మ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోటయ్య, రమేశ్, గోపాలకృష్ణ, మహేశ్ తదితరులున్నారు.

జిల్లా దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడికి సన్మానం

వనపర్తి టౌన్, సెప్టెంబర్ 15 : జిల్లా దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన సంద రమేశ్‌ను ఆదివారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, మున్సిపల్ కౌన్సిలర్ కంచె రవి, అయ్యప్ప సేవా సమితి అధ్యక్షుడు బొల్లం నగేశ్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దస్తావేజులేఖరి బాధ్యతాయుతంగా సేవలందించాలని, రిజిస్ట్రేషన్ ఆఫీస్‌కు వచ్చే వారికి అవగాహన కల్పించి తప్పొప్పులు లేకుండా వారికి సహాయ సహకారాలు అందించాలని సూచించారు.

జవాబుదారీతనంగా ఉంటే దస్తావేజులేఖరి కూడా సమాజ సేవకులు అవుతారన్నారు. కార్యక్రమంలో బొలమోని అంజి, రుడావత్ అంజినాయక్, రాములు ఉన్నారు.

విదేశాలకు వెళ్తున్న విద్యార్థినికి సన్మానం

కొత్తకోట, సెప్టెంబర్ 15 : కొత్తకోట పట్టణానికి చెందిన నిక్సన్, చంద్రకళ దంపతుల కుమార్తె షైని ప్రణీత ఉన్నత చదువుల కోసం ఈ నెల 20వ తేదీన లండన్ వెళ్తున్నారు. ఆదివారం ఆ విద్యార్థిని జేఎస్‌ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారి ఇంటి వద్ద అంబేద్కర్ చిత్రపటాన్ని అందజేసి ఘనంగా సన్మానించారు. సన్మానించిన ఫౌండేషన్ నిర్వాహకులు సతీశ్ రాజ్, కరుణకుమార్, సంపత్, ప్రశాంత్, నాగరాజు, శ్రీనివాసులు ఉన్నారు.

మధుసుదనాచారి దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ ప్రహ్లాదరావు

రాఘవేంద్ర స్వామి మఠాధికారికి సన్మానం

మల్దకల్, సెప్టెంబర్ 15 : జిల్లా రీజినల్ రాఘవేంద్ర స్వామి ఆలయ మఠాధికారిగా నియమితులైన స్వయంభూ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకులు మధుసుదనాచారిని ఆలయ కమిటీ చైర్మన్ ప్రహ్లాదరావు సన్మానించారు. మల్దకల్, అయిజ, గద్వాల, ధరూరు మండలాలకు సంబంధించి రీజినల్ మఠాధిపతిగా మధుసుధనాచారిని నియమిస్తూ మంత్రాలయ పీఠాధిపతి సుభుదేంద్ర తీర్థ స్వామి కరకమలాలతో నియా మకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆదివారం ఆలయంలో పూజలు నిర్వహించి అనంతరం స్వయంభూ ఆలయ స్థాపక వంశీయులు పట్వారీ ప్రహాదరావు మధుసుదనాచారి దంపతులను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో దీరేంద్రదాస్, అరవిందరావు, బాబురావు, చంద్రశేఖర్‌రావు, చంద్రశేఖర్‌రెడ్డి, పద్మారెడ్డి, వీరారెడ్డి ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గేదెలకు కృత్రిమ గర్భదారణపై అవగాహన

వడ్డేపల్లి, సెప్టెంబర్ 15 : మండల కేంద్రంలోని శాంతినగర్ పశువైద్యశాలలో రైతులు, సిబ్బందితో పశువైద్యశాఖ అధికారి పుష్పలత సమావేశం నిర్వహించి గొర్రెల ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ నమోదుపై అవగాహన కల్పించారు. కృత్రిమ గర్భాదారణకు పశు సంవర్ధక శాఖ ద్వారా ఈనెలలో రాయితీపై ఎద కోసం టీకాలు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో వీఎల్‌వో వరప్రసాద్ పాల్గొన్నారు.

జడ్చర్లలో చోరీ

జడ్చర్ల, సెప్టెంబర్ 15 : జడ్చర్ల మున్సిపాలిటీలోని క్లబ్‌రోడ్డులో నివాసం ఉంటున్న అసన్‌అలీఖాన్ అనే వ్యక్తి ఇంట్లో దొంగతనం జరిగినట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌కు చెందిన అసన్‌అలీఖాన్ గత నాలుగేండ్లుగా జడ్చర్లలో నివాసం ఉంటూ ఆప్టికల్ వ్యాపారం చేసుకుంటున్నాడని తెలిపారు. ఈ క్రమంలో ఈనెల 14వ తేదీన రాత్రి 9:30గంటల సమయంలో ఇంటికి తాళం వేసి తమ స్వగ్రామం కొల్లాపూర్ వెళ్లాడు. అయితే 15వ తేదీన ఉదయం 8గంటల సమయంలో అసన్‌అలీఖాన్ ఇంటి తలుపులు తెరుచుకుని, తాళం విరగగొట్టుకుని ఉండటాన్ని చూసిన ఇంటి ఓనర్ అసన్‌కు ఫోన్‌చేసి విషయా న్ని తెలుపగా అసన్ కొల్లాపూర్ నుంచి తిరిగి జడ్చర్లకు వచ్చినట్లు వివరించారు. ఇంటికి వచ్చిన అతను ఇంట్లోకి వెళ్లిచూడగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోని రెండు బీరువాలను విరగగొట్టి ఉండి సామానులు చిందరవందరగ పడేసి ఉండడంతో అందులో ఉన్న బంగారు నక్లెస్, రెండుజతల బంగారు కమ్మలు, రెండు బంగారు రింగులు, మూడుతులాల బంగారు ఆభరణాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారని జడ్చర్ల పోలీసులను ఆదివారం ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వెల్లడించారు.

ప్రాజెక్టులకు వరద

అయిజ, సెప్టెంబర్ 15 : కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. ఆదివారం ఆల్మట్టికి ఇన్‌ఫ్లో 31,986, అవుట్ ఫ్లో 29,128 క్యూసెక్కులుగా ఉన్నది. పూర్తిస్థాయి నీటినిల్వ 129.72 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 128.19 టీఎంసీల నిల్వ ఉన్నది. నారాయణపూర్ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 27,787, అవుట్ ఫ్లో 27,635 క్యూసెక్కులుగా ఉన్నది. పూర్తిస్థాయి నీటి నిల్వ 37.64 టీఎంసీలకు గానూ ప్రస్తుతం 37.46 టీఎంసీలుగా ఉన్నది. టీబీ డ్యాంకు ఇన్‌ఫ్లో 21,986, అవుట్‌ఫ్లో 21,358 క్యూసెక్కులు ఉంది. 105.788 టీఎంసీల గరిష్ఠ సామర్థ్యం కలిగిన డ్యాంలో ప్రస్తుతం 101.773 టీఎంసీల నీటి నిల్వ ఉన్నది.

ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్‌ఫ్లో 17,100, అవుట్ ఫ్లో 16,400 క్యూసెక్కుల వరద నీరు సుంకేసుల బ్యారేజీకి చేరుతోంది. ఆర్డీఎస్ ఆయకట్టుకు 700 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం ఆనకట్టలో 9.5 అడుగుల మేర నీటి మట్టం ఉన్నది.

ఆర్థిక సాయం

జడ్చర్ల, సెప్టెంబర్ 15 : జడ్చర్ల మండలంలోని నసరుల్లాబాద్ గ్రామానికి చెందిన నర్సమ్మగౌడ్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. నర్సమ్మగౌడ్ మృతికి సంతాపం తెలిపిన మాజీ సర్పంచ్ ప్రణీల్ అంత్యక్రియల నిమిత్తం రూ.5వేల ఆర్థిక సాయం ప్రకటించారు. ఈ ఆర్థిక సాయాన్ని గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. అదేవిధంగా వారి కటుంబసభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో లింగంగౌడ్, శంకరయ్యగౌడ్, రాఘవేందర్‌గౌడ్, మల్లేశ్‌గౌడ్, తేజ, యాదయ్య, నాగయ్య, అరుణ్, రామన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బంగారమే శ్రీరామరక్ష!

ఆపత్కాలంలో ఆదుకునేది బంగారం మాత్రమే. సమయానికి చేతిలో చిల్లిగవ్వ లేనప్పుడు ఈ పుత్తడే మీకు పరమాన్నంగా మారుతున్నది. ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రి పాలైనప్పుడు ఈ గోల్డే మీకు ఆర్థికంగా ఆదుకుంటుంది. ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టినప్పుడు బంగారమే శ్రీరామరక్ష. సామాన్యుడి నుంచి మొదలుకొని సంపన్నవర్గాలు కూడా ప్రతియేటా బంగారం ఎంతోకొంత కొనుగోలు చేస్తున్నారు. అక్కరకు వచ్చినప్పుడు ఈ గోల్డ్‌ను తాకట్టుపెట్టుకొని రుణాలు తీసుకుంటున్నారు. వీటికోసం బ్యాంకులతోపాటు ఆర్థిక సేవల సంస్థలు ప్రత్యేకంగా పసిడిపై రుణాలు మంజూరు చేస్తున్నాయి. సెక్యూర్డ్ రుణాలు కావడంతో బంగారం విలువలో 80 శాతం వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయి బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు. బంగారం కడ్డీలతోపాటు ఆభరణాలు తాకట్టుపెట్టుకొని కేవలం కొన్ని నిమిషాల్లోనే రుణం పొందవచ్చును. వ్యక్తిగత రుణాలు, ఇతర రుణాలు తీసుకోవాలంటే రోజుల సమయం పడుతుంది కానీ, బంగారంపై రుణాలు తీసుకోవడం ఎంతో సులభం. పెద్దగా డాక్యుమెంట్లు లేకుండానే తీసుకోవచ్చును. తక్కువ వడ్డీకే రుణాలు తీసుకోవచ్చును. ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులతో పాటు ప్రైవేట్ రంగ బ్యాంకులు 8 శాతం మొదలు కొని 24 శాతం వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. తీసుకున్న రుణాలను ఏడాదిలోగా చెల్లించాల్సి ఉంటుంది. లేకపోతే బ్యాంకులు తాకట్టుకింద పెట్టిన ఆభరణాలను జప్తు చేసుకొని వేలం వేసుకునే అధికారం ఉంటుంది. పసిడి విలువను గుర్తించడంలో ఒక్కో బ్యాంకుది ఒక్కో తీరుగా ఉంటుంది.

పసిడి రుణాలపై ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీ

బ్యాంక్	వడ్డీరేటు(శాతంలో)	ప్రాసెసింగ్ ఫీజు
కొటక్ మహీంద్రా	8 నుంచి 24 వరకు	2 శాతం+జీఎస్టీ
హెచ్‌డీఎఫ్‌సీ	8.30 నుంచి 16.55 వరకు	ఒక్క శాతం
సెంట్రల్ బ్యాంక్	8.40 నుంచి 9.25 వరకు	రుణంపై అరశాతం
యూకో	8.50	రూ.250-5 వేల వరకు
ఇండియన్ బ్యాంక్	8.80 నుంచి 9 వరకు	రుణంపై 0.56 శాతం
యూనియన్ బ్యాంక్	8.65 నుంచి 9.90 వరకు	-
ఎస్బీఐ	8.70	అర శాతం+జీఎస్టీ
ఇండస్‌ఇండ్	8.75 నుంచి 16 వరకు	రుణంపై ఒక్క శాతం
బంధన్ బ్యాంక్	8.75 నుంచి 19.25 వరకు	ఒక్క శాతం+జీఎస్టీ
బ్యాంక్ ఆఫ్ బరోడా	9.15	వర్తించే చార్జిలు+జీఎస్టీ
పంజాబ్ నేషనల్	9.25	రుణంపై 0.75 శాతం
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	9.30	రూ.500-2,000+జీఎస్టీ
ఫెడరల్ బ్యాంక్	9.49	-
కెనరా బ్యాంక్	9.60	రూ.500-5 వేల వరకు
ఐసీఐసీఐ బ్యాంక్	10	రుణంపై ఒక్క శాతం

క్రెడిట్ స్కోర్ అక్కర్లేదు..

సిబిల్ స్కోర్ లేకుండానే బంగారంపై రుణాలు తీసుకోవచ్చును. కేవలం బంగారం లేదా ఆభరణాలు తాకట్టు పెట్టుకొని రుణాలు తీసుకోవచ్చును. దీనికోసం వారి క్రెడిట్ స్కోర్ ఎంత ఉన్నదో అవసరం లేదు. 500 లోపు సిబిలి స్కోర్ ఉన్నవారు కూడా సులువుగా రుణాలు తీసుకోవచ్చును.

కావాల్సిన డాక్యుమెంట్లు

బంగారం తాకట్టుపై రుణాలు తీసుకోవడానికి పలు డాక్యుమెంట్లు అవసరం ఉంటాయి. వీటిలో ఆధార్ కార్డుతోపాటు పాన్ కార్డు, బ్యాంక్ ఖాతాతోపాటు కేవైసీ డాక్యుమెంట్ సమర్పించాల్సి ఉంటుంది. మనం తీసుకునే బ్యాంకులోనే ఖాతా ఉండాల్సి ఉంటుంది. ఇటీవలకాలంలో బ్యాంకులతోపాటు పసిడిపై రుణాలు ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఇస్తున్నాయి.

తిరిగి చెల్లింపులు ఎలా..

బంగారంపై తాకట్టుపై రుణాలు తీసుకున్నవారు మూడు రకాలుగా తిరిగి చెల్లింపులు జరుపుకునే అవకాశాలను బ్యాంకులు కల్పించాయి. వీటిలో నెలవారి చెల్లింపుల రూపంలో చెల్లింపులు జరుపుకోవచ్చును, లేదా మూడు నెలల్లో వడ్డీతో సహా తీసుకున్న రుణాన్ని చెల్లించవచ్చును. అలాగే ఆరు నెలలు, ఏడాది కాల పరిమితితో తీసుకున్న రుణాలను వడ్డీతో కలుపుకొని చెల్లించుకోవచ్చును. ఒకవేళ ఏడాది ముగిసిన తర్వాత తీసుకున్న రుణానికి వడ్డీని చెల్లించి మళ్లీ రెన్యూవల్ చేసుకోవచ్చు.

కొత్త పీపీఎఫ్ రూల్స్

అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) ఖాతాలను మైనర్ల కోసం కూడా తెరుచుకోవచ్చు. మారిన నిబంధనల ప్రకారం సదరు మైనర్లకు 18 ఏండ్లు నిండేదాకా ఈ ఖాతాలు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేటుతో కొనసాగుతాయి. మైనార్టీ తీరిన తర్వాత పీపీఎఫ్ ఖాతాగా మార్చుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇక ఒకటికి మించి పీపీఎఫ్ ఖాతాలనూ తెరుచుకోవచ్చు. అలాగే ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీం (పీపీఎఫ్) 1968 కింద క్రియాశీల పీపీఎఫ్ ఖాతాలను తెరిస్తే ఫామ్ హెచ్ ద్వారా ఖాతాదారుని నివాస హోదా గురించి అడగకపోతే పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ మార్గదర్శకాల ప్రకారం ఈ నెలాఖరుదాకా ఉండే వడ్డీరేట్లు వర్తిస్తాయి. పీపీఎఫ్ అనేది కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాధనం. అంతేగాక మదుపరులను దీర్ఘకాలిక ఆకర్షణీయ ప్రయోజనాలతో కూడిన సేవింగ్స్, పెట్టుబడులకు ప్రోత్సహించే పథకం ఇది. దీనికి ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపులూ వర్తిస్తాయి.

షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా

లాభాలు, పరిమితులు తెలుసా?

షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా తాత్కాలిక కవరేజీని కల్పిస్తుంది. దీన్నే టర్మ్ మెడికల్ ఇన్సూరెన్స్ అని కూడా పిలుస్తారు. సాధారణంగా ఇది కొద్ది నెలల నుంచి ఏడాదిదాకే ఉంటుంది. ఎవరైతే స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలతో వచ్చే దీర్ఘకాలిక ఆరోగ్య బీమాలు కాకుండా తక్షణ కవరేజీలను కోరుకుంటారో వారినుద్దేశించినదే ఈ పాలసీ. సమగ్ర కవరేజీని కొనలేనివారికి కూడా ఇది ఉపయుక్తంగా ఉంటుంది. కంపెనీల్లో గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం వేచిచూస్తున్న ఉద్యోగులు, నిరుద్యోగులకు దీని అవసరం ఎక్కువని చెప్పవచ్చు.

షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ శైలి

- కేవలం కొద్ది నెలల నుంచి ఏడాది వరకే బీమా కవరేజీ.
- లాంగ్-టర్మ్ ప్లాన్లతో పోల్చితే షార్ట్-టర్మ్ ప్లాన్లకు ప్రీమియంలు తక్కువే.
- ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలకు బీమా కవరేజీ ఉండకపోవచ్చు. కొన్ని రకాల చికిత్సలకూ వీలుండదు.
- కనీస ఆరోగ్య సమాచారంతో ఈ ప్లాన్లను తీసుకోవచ్చు.
- పరిమిత స్థాయిలోనే ఈ ప్లాన్ల చెల్లుబాటు ఉంటుంది. ఎంపిక చేసిన నెట్‌వర్క్‌లో తప్ప.. అన్ని దవాఖానల్లో చెల్లవు.
- లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను రెన్యువల్ చేసుకున్నట్టుగా ఈ షార్ట్-టర్మ్ పాలసీలను రెన్యువల్ చేసుకోలేం.

చివరగా..

షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లు తక్షణ అవసరాలకే పనికొస్తాయి. కాబట్టి లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లకే ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందుతాం. ప్రీమియంలు ఎక్కువైనప్పటికీ క్లెయిములు లేకపోతే కవరేజీలు పెరిగే ప్రయోజనం ఉంటుంది. మెటర్నిటీ, మెంటల్ హెల్త్ తదితర అవసరాలు, సమస్యలకూ స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లే లాభదాయకం అని స్పష్టంగా చెప్పవచ్చు. అందుకే సమగ్ర ప్యాకేజీని తీసుకోవడం మరువద్దు.

రాబడి

ఫెడ్ నిర్ణయమే కీలకం..

దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల జోష్‌లో సాగుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకు మద్దతు పలుకుతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో గురువారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,440, నిఫ్టీ 470 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీ ఎత్తున పుంజుకోగలిగాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,707.01 పాయింట్లు ఎగిసి 82,890.94 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 504.35 పాయింట్లు ఎగబాకి 25,356.50 దగ్గర ముగిసింది. మునుపెన్నడూ లేనివిధంగా సెన్సెక్స్ తొలిసారి 83వేల మార్కును అధిగమించింది. నిఫ్టీ సైతం నూతన గరిష్ఠాలను తాకింది. ఈ నేపథ్యంలో ఈ వారం అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం కనిపిస్తున్నది. శుక్రవారమే మార్కెట్లలో సెల్లింగ్ ప్రెషర్ ఉండటాన్ని గమనించవచ్చు. పారిశ్రామికోత్పత్తి మందగించడం, ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తున్న సంకేతాలు రావడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు బ్రేక్ వేయవచ్చన్న అభిప్రాయాలను మెజారిటీ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. పైగా సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉండటం కూడా లాభాల స్వీకరణకు తావిస్తోందంటున్నారు. ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య సమీక్ష ప్రభావం కూడా కనిపించనున్నది. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,700-25,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఏ బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

యూబీఐ ప్రత్యేక డిపాజిట్ స్కీం

ప్రభుత్వ రంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్లను ఆకట్టుకోవడానికి ప్రత్యేక డిపాజిట్ స్కీంను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 333 రోజుల కాలపరిమితితో యూనియన్ సమృద్ధి స్కీంపై అధిక వడ్డీ రేటును ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. ఈ స్కీంలో కనీసంగా రూ.1,000 నుంచి రూ.3 కోట్ల లోపు డిపాజిట్ చేయవచ్చును. ఈ స్కీంపై సాధారణ ప్రజలకు 7.40 శాతం వార్షిక వడ్డీని చెల్లిస్తున్న బ్యాంక్..సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. మెచ్యూర్ కాకముందే ఈ డిపాజిట్లను విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని బ్యాంక్ కల్పించింది. కానీ, ఇలా చేసుకుంటే ఒక్క శాతం వడ్డీని తగ్గి చెల్లించనున్నది. ఈ డిపాజిట్ స్కీంను ఎంచుకోవడానికి బ్యాంక్ శాఖ లేదా వెబ్‌సైట్ ద్వారా డిపాజిట్ చేయవచ్చును.